క్లుప్తంగా

నేటి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి తరలిరండి

బుచ్చెయ్యపేట : అనకాపల్లిలో సోమవారం జరిగే వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల ముఖ్య నాయకులు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు పిలుపు నిచ్చారు. అనకాపల్లి రింగ్ రోడ్డు దగ్గరలో ఉన్న పెంటకోట కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆపరేటివ్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

తొలకరి నువ్వు చేలకు మేలు చేసిన వర్షం

నాతవరం : ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ఉక్కపోతతో తీవ్రంగా ఎండ కాచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురియడంతో ప్రజలకు ఉపశమనం కలిగించింది. ఈ వర్షం వ్యవసాయం సాగు చేసే రైతులకు ఆరుతడి తొలకరి పంట నువ్వు చేను వేసుకోవడానికి పొలాల్లో దుక్కులు చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ వర్షం కురియకపోతే చాలా చోట్ల పంట పొలాల్లో వేసిన నువ్వు చేను ఎండిపోయే పరిస్థితిలో ఉండేదని రైతులు అంటున్నారు. మండలంలో ఆదివారం కురిసిన వర్షంతో మండల కేంద్రంలో గల తహసీల్దార్, ఎంపీడీవో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు చేరి ప్రాంగణమంతా బురదమయంగా తయారైంది.

వేసవి శిబిరంలో క్రీడాపోటీలు



చౌడువాడలో విద్యార్థులకు బాటిల్ గేమ్ నిర్వహిస్తున్న పద్మావతి

కె.కోటపాడు : విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణతో మంచి ఆరోగ్యంతో పాటు వయసుకు తగ్గ ఎదుగుదల ఉంటుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించే కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యార్థులకు బాటిల్ గేమ్‌తో పాటు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున క్రీడాపోటీల్లో ప్రతిభను చూపిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు.

68 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు సురేష్

మాకవరపాలెం : ఉచిత కంటి వైద్య శిబిరంలో 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మహిళా మార్ట్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న 68 మంది రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్య నిపుణుడు సురేష్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 42 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. కార్యక్రమంలో క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాతవరంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

నాతవరం : మండల కేంద్రం నాతవరం ఒకటో గ్రామ సచివాలయంలో సోమవారం మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో కె.ఉషాశ్రీ తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డులలో పేర్లు తప్పుఒప్పులను సవరణ చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోదకొండమ్మకు బంగారు శతమానాలు



ఘాట్‌రోడ్ జంక్షన్ లో వెలసిన మోదకొండమ్మకు శతమానాలు అందజేస్తున్న ప్రసాద్ దంపతులు

మాడుగుల : మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మకు మాడుగుల గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్ (హల్వా షాపు) బ్రదర్స్ ఆదివారం అమ్మవారికి బంగారు శతమానాలు సమర్పించారు. వీరిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కోట్ని సత్యారావు, పుట్టా బలరామ్, కోట్ని శ్రీను, దంగేటి వాసు వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బంగారుమెట్ట జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో గోతులతో వాహనదారుల అవస్థలు



శింగవరం వద్ద రోడ్డు మధ్యలో చెరువును తలపిస్తున్న గొయ్యి

- అడుగడుగునా గోతులు
- ప్రమాదకరంగా బీఎన్ రోడ్డు
- వర్షాలకు గోతుల్లో చేరిన నీళ్లు

రోడ్లు చూస్తే.. గుండె చెరువు



గోతుల మయంగా బీఎన్ రోడ్డు



వడ్డాది పెట్రోల్ బంక్ వద్ద గోతులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. పెద్దపెద్ద గోతులు, గుంతల్లో చేరిన నీటి గుంటలను చూసి పలువురు తమ సెల్‌ఫోన్‌ల్లో బంధించి బిఎన్ రోడ్డు సొగసు చూడతరమా అంటూ రోజూ సెటిజన్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం,పాలకులు మొద్దునిద్ర వహిస్తున్నారు. పేరుకే బిఎన్ రోడ్డు అయిన పెద్దపెద్ద గోతులు పడి బురదమయంగా మారింది. చెరువును తలపించేలా ఉండే రోడ్డు మధ్యలో గోతులను చూసి కొత్తగా ఈ రహదారిలో వచ్చే ప్రయాణీకులు ఇది రోడ్డా,పంట పొలాలా ఇక్కడ పాలకులున్నారా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. పొట్టిదొరపాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల వద్ద ఉన్న పెద్ద పెద్ద గోతుల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి నీటి గుంతల్లా కనిపిస్తున్నాయి. ఈ గోతుల్లో పెద్దపెద్ద వాహనాలు కూరుకుపోయి బురదలో ఉండిపోతున్నాయి. బంగారుమెట్ట జంక్షన్, శింగవరం, వడ్డాది గోతుల్లో వాహనాలు కూరుకు పోవడంతో ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ల సాయంతో కూరుకుపోయిన వాహనాలను బైటకు లాగుతున్నారు. రాత్రిపూట ఈ గోతుల్లో నుండి ద్విచక్ర వాహనదారులు, ఆటో, సైకిల్ ఇతర వాహనదారులు రాకపోకలు సాగించడానికి నరకయాతన పడడమే కాక ప్రమాదాలకు గురౌవుతున్నారు.

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు..

బీఎన్ రోడ్డుకు గత వైఎస్‌ఆర్‌సీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరై ఉన్న టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ అప్పట్లో పనులు సక్రమంగా చేయకపోగా ఇపుడు అధికారి పార్టీలో ఉండి రోడ్డు పనులు చేయకపోవడంపై పలు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వేలాది మంది ప్రయాణికులు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే బురదమయం



చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారిన రోలుగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు

రోలుగుంట : రెండు రోజులుగా మండల కేంద్రంలో ఉదయం ఎండలు, మధ్యాహ్నం వర్షం పడుతుంది. దీంతో మండల కేంద్రంలో గల ఆర్‌అండ్‌బీ రహదారి వర్షపునీటితో బురదమయంగా మారింది. వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రోడ్డులో గల గోతుల్లో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి బోల్తాపడి పలువురు గాయాలపాలవుతున్నారు. ఎన్నికల ముందు ఈ రోడ్డు ఏర్పాటే ప్రధాన అజెండా అంటూ మోసపూరిత హామీఇచ్చి అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది గడుస్తున్నా హామీ మాత్రమే అలానే ఉంది. రోడ్డు పనులు మాత్రం పూర్తి కాలేదు. రెండు రోజులుగా పడుతున్న ఒక మోస్తరు వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి చూసి ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రోడ్డు బాగు చేయాలని, లేకపోతే ప్రజాగ్రహం తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు.

వైభవంగా తలుపులమ్మ పండగ



పాచిలవానిపాలెంలో అమ్మవారికి దర్శించుకొన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామస్తులు తలుపులమ్మ అమ్మవారి పెద్ద పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కంచుగుర్రాలతో గ్రామంలో ఊరేగింపు, తోలేలు, ఘటాలు, రథంతో పండగను భక్తిశ్రద్ధలతో చేశారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు జరిపేందుకు బారులు తీరారు. తలుపులమ్మ పండగ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ ఘనంగా దుశ్శాలువాలతో సన్మానం చేశారు. అమ్మవారిని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, గొర్రుపోటు వెంకటరావు, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, చీపురపల్లి అచ్చిబాబు, రొంగలి రమేష్, వంటాకు గోవిందరావు, శ్రీకాంత్ శ్రీను దర్శించుకున్నారు.

టెన్త్ టాపర్ ఉదయ్‌కుమార్‌కు ప్రోత్సాహక బహుమతి



టెన్త్ టాపర్ ఉదయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్, ఆప్త మిత్ర సంఘం సభ్యులు

దేవరాపల్లి : పదో తరగతిలో 590 మార్కులు సాధించిన తిమిరాం గ్రామానికి చెందిన విద్యార్థి గుంపాన ఉదయ్‌కుమార్‌ను స్థానిక ఆప్త మిత్ర సంఘం సభ్యులు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. తిమిరాంలో మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్, గ్రామస్తుల సమక్షంలో ఉదయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించి, రూ. 5వేలు ప్రోత్సాహక నగదును అందజేశారు. విద్యార్థి తల్లిదండ్రులు సత్తిబాబు, లక్ష్మిలను సైతం అభినందించారు. వేచలం ప్రభుత్వ పాఠశాలలో(జెడ్పీ హైస్కూల్) చదివి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించడం అభినందనీయమని, ఎంఈవో పడాల్‌దాస్‌తో పాటు ఆప్త మిత్ర సంఘం సభ్యులు ప్రశంసించారు. విద్యలో నైపుణ్యం కనబరిచే ప్రతి ఒక్కరికీ ఆప్తమిత్ర సంఘం సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని భరోసా కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పీవీ రావు జయంతి విజయవంతం చేయండి

రోలుగుంట : ఈ నెల 12వ తేదీన కాకినాడలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు జయంతి కార్యక్రమం విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బుంగా సాయి మాల ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాలలను అణిచివేయడమే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు పనిచేస్తున్నారని విమర్శించారు.

శరవేగంగా విజయాంజనేయ గోపురం పనులు

మాడుగుల : స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ స్వామి ఆలయ గోపురం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రానున్న హనుమాన్ జయంతి నాటికి ఈ గోపుర పనులు పూర్తి చేయడానికి సుమారు రూ. 5 లక్షలతో నిర్మాణం చేపడుతున్నారు. స్వామివారి గోపుర నిర్మాణంతో పాటు శ్రీరాముని పట్టాభిషేకం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి స్వామివారి ఆశీసులు పొందాలని ఆలయ కమిటీ కోరుతుంది.

జూడోలో ఉచిత శిక్షణ



శిక్షణకు వచ్చిన విద్యార్థులకు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్న చైర్మన్ నారాయణరావు

నర్సీపట్నం : డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ వారి సౌజన్యంతో ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత జూడో సమ్మర్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. ఈ క్యాంపును మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ వెలగా నారాయణరావు, ఫార్మర్ డైరెక్టర్, సీనియర్ కోచ్ తోట ప్రసాద్ ప్రారంభించారు. జూడో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నారాయణ రావు విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు జూడోలో తర్ఫీదు ఎంతో ఉపకరిస్తుందన్నారు. డైరెక్టర్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు పోషకాహారం అందించారు.

తాత్కాలిక మరమ్మతులతో అవస్థలు



వర్షాలకు చిత్తడిగా మారిన బస్టాండు ఆవరణ

మాకవరపాలెం: తాత్కాలిక మరమ్మతులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షం కురిసినా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండు ఆవరణ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారింది. ఏళ్ల తరబడి ఈ ఆవరణలో ఆర్టీసీ నిధులతో తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఈ స్టాండులో అడుగు పెట్టేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే బస్సులు ఎక్కేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశానికి తరలిరండి



సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతున్న జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట : వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 5న అనకాపల్లి రింగు రోడ్డు వద్ద గల పెంటకోట కన్వెన్షన్ హాలులో జరగనుంది. ఈ సమావేశం గురించి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీ రమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ అభివృద్ధి, గ్రామస్థాయి సమస్యలపై చర్చ, ప్రజలతో మమేకం కూటమి ప్రభుత్వం వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నష్టాలు, ప్రధానంగా భీమిలి -నర్సీపట్నం రోడ్డు నిర్మాణంపై మాయమాటలతో గద్దెనెక్కి, ఏడాదిగా చేస్తున్న తాత్సారం, ప్రభుత్వ పాలన వైఖరి తదితర అంశాలపై చర్చ జరగనుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలకు తమ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నేనున్నానని నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఏ మూలన ఏ ప్రమాదం జరిగినా వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ఆ సమస్య మూలాలు తెలుసుకొని బాధితులను పరామర్శించి, వారికి అండగా ఉండాలని తమ పార్టీ స్థానిక నాయకులకు సూచిస్తున్నారన్నారు. ఎంతో ప్రత్యేకతతో కూడిన ఈ సమావేశం జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు కరణం ,ధర్మశ్రీ అధ్యక్షతన జరగనున్న దృష్ట్యా మండలంలో గల పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బాల వికాస్‌తో చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం



వాలాబులో బాల వికాస్ చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జ్ శంకర్, జోన్ ఇంచార్జ్ రవిశంకర్

దేవరాపల్లి: బాల వికాస్ కార్యక్రమం బాల బాలికల్లో సమగ్ర వ్యక్తిత్వ వికాసం, సత్ప్రవర్తన కలిగేలా దోహదపడుతుందని అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల బాలవికాస్ ఇంచార్జ్ ఎన్.శంకర్ అన్నారు. వాలాబు గిరిజన గ్రామంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బాల వికాస్ కార్యక్రమం జరిగింది. ముందుగా భగవాన్ సత్య సాయి చిత్రపటం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలు ఆధ్యాత్మిక చింతన కలిగి ప్రతి ప్రాణి పట్ల ప్రేమతో మెలిగే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. సత్యం, ధర్మం, శాంతి మార్గాన్ని అనుసరించాలని, ఇదే బాల వికాస్ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన బాల బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సంస్థల బాలవికాస్ జోన్ ఇంచార్జ్ రవిశంకర్, నూకరాజు, సన్యాసిరావు, జనార్దన్, వరలక్ష్మి తదితర సత్యసాయి భక్తులు, బాలవికాస్ చిన్నారులు పాల్గొన్నారు.

రెండు మండలాల నడుమ తారురోడ్డు నిర్మాణం పూర్తి



నాతవరం, గొలుగొండ మండలాల మధ్య కొత్తగా నిర్మించిన తారురోడ్డు

నాతవరం : రెండు మండలాల మధ్య సరిహద్దులో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో మూడు మండలాల ప్రజలకు రాకపోకలకు సాగించేందుకు దగ్గర దారి అవుతుంది. మండలంలో వల్సంపేట పంచాయతీ శివారు తాళ్లపాలెం నుంచి గొలుగొండ మండలం వడపర్తి గ్రామం మధ్య పోంతరోడ్డుకు ప్రభుత్వం రూ.కోటి 40 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో రెండు మండలాల సరిహద్దు మట్టిరోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయడంతో ప్రస్తుతం ఈ రోడ్డుపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణంతో నాతవరం, గొలుగొండ మండలాలకు దగ్గర దారి కావడంతో పాటు నర్సీపట్నం మండల వాసులకు కూడా అనుకూలంగా ఉంటుంది. ఇంతవరకు నాతవరం మండలంలో వల్సంపేట, తాళ్లపాలెం, ఉటమల్ల, తాండవ, మాధవనగరం, గంటావారి కొత్తగూడెం, జాలారిపేట గ్రామాలకు చెందిన వారు నర్సీపట్నం వెళ్లాలంటే చుట్టూ 30 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి ఉండేది. ప్రస్తుతం ఆయా గ్రామాల వారు నర్సీపట్నం చేరుకోవాలంటే కేవలం పది నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. గొలుగొండ మండలంలో వడపర్తి, కొమిమి, జొమ్మవరం, కొత్తూరు, కరక, దోణీపాలెం తదితర గ్రామాల ప్రజలకు అటు నర్సీపట్నం వెళ్లడానికి తారురోడ్డు సౌకర్యంతో పాటు దగ్గర దారి అవుతుంది.

కోతుల నుంచి పంటలను కాపాడండి



కోతులు నాశనం చేసిన పంట

రావికమతం : చేతికి అందివచ్చిన పంటలను కోతులు మూక నాశనం చేస్తున్నాయాని మేడివాడ గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా మామిడి, జీడి , తదితర ఫల సాయాన్ని కోతులు మూకలు కొరికి నాశనం చేస్తున్నాయి. సంవత్సరం మొత్తం కష్టపడి పండించి పంట చేతికి అందే సమయంలో కోతులు నాశనం చేయడంతో ఏం చేయాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడును ఇప్పటికే అటవీశాఖ అధికారులకు తెలియజేశామని, కోతుల మూకల నుంచి నష్టపోయన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

వర్షాలకు నేలకూలిన చెట్లు



కె.జె.పురం-దబ్బకుంట రహదారిలో నేలకొరిగిన చెట్టు



ముకుందపురం వద్ద 33 కె. వి. విద్యుత్ లైన్ మీద పడిన తాటిచెట్టు

మాడుగుల రూరల్: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల చెట్లు నేల కొరిగాయి. శనివారం అర్ధరాత్రి, ఆదివారం భారీ వర్షం కురిసింది. కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో ఎర్రమ్మ చెరువు కాలువ వద్ద పెద్ద చెట్టు నేల కూలింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించి పోయాయి. వడ్డాది నుంచి మాడుగుల వెళ్లే 33 కె.వి. విద్యుత్ లైన్ మీద తాటిచెట్టు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలి

అనకాపల్లి టౌన్: ఉద్యోగుల సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలని ఎన్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 65వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేసి, డిపో మార్చిన కండెక్టర్, డ్రైవర్లను యథావిధిగా ఇక్కడి డిపోలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, వి.ఆర్.ఎస్.ఎస్.రావు, కె.వి. లక్ష్మి, సీహెచ్.సత్యవతి, బి.ఎ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించాలి



కె.జె.పురం జంక్షన్ వద్ద మట్టి కుప్పలతో రహదారిని మూసివేసిన దృశ్యం



జంక్షన్ వద్ద సీసీ రోడ్డుకు అప్రోచ్ రోడ్డు లేకపోవడం వల్ల ద్విచక్రవాహనదారు అగచాట్లు

మాడుగుల రూరల్ : మండలంలో తాటిపర్తి నుంచి వడ్డాదికి రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామాల వద్ద సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కె.జె.పురం జంక్షన్ వద్ద ఇటీవల 150 మీటర్ల సీసీ రోడ్డు రహదారి కిరువైపులా నిర్మించారు. గత నెలలో ఒక వైపు సిమెంటు రోడ్డు వేశారు. రెండో వైపు రోడ్డు ఇటీవల వేశారు. తాజాగా వేసిన రహదారి మీద రాకపోకలను నిషేధించారు. దీంతో కె.జె.పురం గ్రామంలోకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారి దిగువ నుంచి గతంలో వేసిన సిమెంటు రోడ్డుకు అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉండగా, వేయకుండా మరో 10 రోజుల వరకు రోడ్డును పూర్తిగా బ్లాక్ చేశారు. కె.జె.పురం జంక్షన్ మార్గం భాగంలో మట్టి కుప్పలతో పూర్తిగా మూసివేశారు. కె.జె.పురం గ్రామం నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖ వెళ్లే ప్రయాణికులు ఈ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంది. రహదారిని పూర్తిగా మూసివేయడంతో వాహనాలు కె.జె.పురం గ్రామం నుంచి వంటర్లపాలెం, ముకుందపురం రహదారి మీదుగా వెళ్తున్నాయి. కాగా జంక్షన్‌లో నిర్మించిన రహదారికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. అప్రోచ్ రోడ్డు లేకపోవడం వల్ల ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, కొత్తగా వేసిన రోడ్డు మీద తాత్కాలికంగా ఈ రహదారి గుండా వాహనాలు తిరగడం నిలుపుదల చేశామని, వారం రోజుల తర్వాత రోడ్డు మీద వాహనాలు తిరిగి క్రమబద్ధీకరిస్తామని తెలిపారు.